సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 7 । జనవరి । 2024



కనులపండువగా రథయాత్ర

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి రథయాత్ర శనివారం వైభవంగా జరిగింది. 8లో



అప్పన్న.. అందుకో తిరుముడి

అప్పన్న నామస్మరణతో సింహగిరి మార్మోగింది. మాలధారుల దీక్షా విరమణ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. 8లో



సాంస్కృతిక సౌరభం

ఏయూలో జరుగుతున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కల్చరల్ ఫెస్ట్‌లో సాంస్కృతిక సౌరభాలు వెల్లివిరిశాయి. 8లో

ఉత్తర.. జనజాతర



బస్సు యాత్రను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

- పరవళ్లు తొక్కిన సామాజిక చైతన్యం
- సాధికార బస్సు యాత్రకు పోటెత్తిన ప్రజా ప్రవాహం
- ప్రతిధ్వనించిన 'జై జగన్' నినాదం
- మంత్రులు, నేతలకు అడుగడుగునా బ్రహ్మరథం



బైక్ ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు



బహిరంగ సభకు హాజరైన అశేష జనసందోహం

సీతంపేట: విశాఖ ఉత్తర.. జనసంద్రమైంది. మాధవధార నుంచి కైలాసపురం వరకు జనజాతరను తలపించింది. నియోజకవర్గంలో శనివారం వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ ఛైర్మన్ కె.కె.రాజు ఆధ్వర్యంలో జరిగిన బైక్ ర్యాలీ, బహిరంగ సభకు పోటెత్తారు. నాలుగున్నరేళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును వివరిస్తూ ముందుకు సాగిన మంత్రులు, ప్రజాప్రతినిధులను వైఎస్సార్ సీపీ జెండాలు పట్టుకుని అనుసరించారు. మేలు చేసిన ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ.. జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీల నోట ఆత్మ గౌరవం నినాదం దిక్కులు పిక్కటిల్లేలా ప్రతిధ్వనించింది. సభా ప్రాంగణం 'జై జగన్' నినాదం మార్మోగింది.

యాత్ర సాగిందిలా..

- ముందుగా సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది.
- అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్‌కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో రూ.2.17 కోట్లతో అధునాతంగా నిర్మించిన పాఠశాల భవనం, తరగతి గదులు, ఆట స్థలాన్ని పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ప్రారంభించారు. విద్యార్థులతో ముచ్చటించారు.
- మాధవధారలోని మిలాన్ ఫంక్షన్ హాల్ వద్ద పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి బైక్ ర్యాలీ, బస్సు యాత్రను ప్రారంభించా రు. బస్సుకు ముందు, వెనుక భాగంలో వందలాదిగా యువకులు మోటారు సైకిళ్లతో అనుసరించారు.
- మురళీనగర్ మెయిన్ రోడ్, వర్మ కాంప్లెక్స్, కైలాసపురం పోర్టు రోడ్ మీదుగా కై లాసపురంలోని ఇనార్బిట్‌మాల్ రోడ్‌లో ఏర్పాటు చేసిన సభా వేదిక వరకు కోలాహలంగా యాత్ర సాగింది.
- కైలాసపురం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- మిలాన్ ఫంక్షన్ హాల్ నుంచి కైలాసపురం వరకు సుమారు 8 కిలోమీటర్లు జై జైగన్ నినాదాలతో హోరెత్తింది.
- అశేష జనవాహిని మధ్య ఇనార్బిట్ మాల్ రోడ్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభ జరిగింది.

కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, మేరుగు నాగార్జున, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జెడ్పీ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎంపీ ఎం.వి.వి. సత్యనారాయణ, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు, కుంభా రవిబాబు, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, గొల్ల బాబూరావు, కంబాల జోగులు, పెట్ల ఉమాశంకర గణేష్, డిప్యూటి మేయర్ జియ్యాని శ్రీధర్, కె.సతీష్, గాజువాక ఇన్‌చార్జి ఉరుకూటి చందు, కార్పొరేషన్ ఛైర్మన్లు జాన్ వెస్లీ, మధుసూదనరావు, పిల్లి సుజాత, పిల్లా సుజాత, మాధవీవర్మ, అంధవరపు సూరిబాబు, పేర్ల విజయ్‌చందర్, వీఎంఆర్డీఏ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్ కుమార్, ఎస్ఏ రెహమాన్, చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి, అల్లు భానుమతి, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనోక్, అల్లు శంకర్‌రావు, స్మార్ట్ సిటీస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ జి.వెంకటేశ్వరరావు, నార్త్ నియోజకవర్గ పరిశీలకులు చిక్కాల రామారావు, రొంగలి జగన్నాథం, పసుపులేటి బాలరాజు, ఐహెచ్ ఫరూఖీ, చొక్కా కుల వెంకట్రావ్, కాశీ విశ్వనాథ్ శ్రీనివాస్ రెడ్డి, సీఈసీ సభ్యుడు శ్రీకాంత్‌రాజు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, చిత్రంలో మంత్రి మేరుగు నాగార్జున, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు

కోట్ల రూపాయలతో నియోజకవర్గ అభివృద్ధి

విశాఖ ఉత్తర సమన్వయకర్త కె.కె రాజు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో సుమారు రూ.170 కోట్లతో పార్కులు, రోడ్లు, మౌలిక వసతులు కల్పన, రూ.6.73 కోట్లతో ఆరు చోట్ల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓ జూనియర్, డిగ్రీ కళాశాల మంజూరైందన్నారు. రూ.70 కోట్లతో ఆర్ అండ్ బీ జంక్షన్ నుంచి మాధవధార మీదుగా సీతమ్మధార వరకు 80 ఫీట్ రోడ్డు అభివృద్ధి జరగనుందన్నారు. రూ.238 కోట్లతో సీసీ రోడ్లు, కాలువలు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.12.40 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. రూ.24 కోట్లతో నూతన సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. కంచరపాలెం ఇండస్ట్రీయల్ ఎస్టేట్ ప్రాంతంలో ఏఎస్ఎన్ మెగా మాల్ నిర్మాణం, రూ.500 కోట్ల పెట్టుబడులతో ఇనార్బిట్ మాల్ నిర్మాణం జరుగుతోందన్నారు. క్రీడల ప్రోత్సాహం కోసం ఇండోర్ స్టేడియం మంజూరైందన్నారు. ఇలా రూ.3467.76 కోట్లను సంక్షేమం, అభివృద్ధి కోసం వెచ్చించినట్లు వివరించారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు.

అందరికీ కృతజ్ఞతలు

ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ విశాఖ నార్త్ సమన్వయకర్త కె.కె.రాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జిలు, మండల ఇన్‌చార్జిలు, అభిమానులకు, పటిష్ఠ బందోబస్తు నిర్వహించిన పోలీసులకు ధన్యవాదాలు చెప్పారు. ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ సామాజిక బస్సు యాత్రకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారన్నారు.



తరగతి గదిని పరిశీలిస్తున్న వై.వి.సుబ్బారెడ్డి

దేశంలోనే ఆదర్శ సీఎం వైఎస్ జగన్

వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి దేశంలోనే ఆదర్శవంతమైన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలిచారని వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా శనివారం ఉత్తర నియోజకవర్గంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తరాంధ్రలో రెండు విడతల్లో జరిగిన బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మ రథం పట్టారన్నారు. మూడో విడత సామాజిక సాధికార బస్సు యాత్ర విశాఖ ఉత్తర నుంచి ప్రారంభమైందని తెలిపారు. ఉత్తరాంధ్రలో ఇంకా నాలుగు నియోజకవర్గాల్లో బస్సు యాత్ర నిర్వహిస్తామన్నారు. 20న పాయకరావుపేట, 22న శ్రీకాకుళం, 24న విజయనగరం, 25న విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో బస్సు యాత్ర జరుగుతుందని.. దీంతో యాత్ర పూర్తవుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధి, సామాజిక న్యాయాన్ని ప్రజలకు వివరిస్తున్నట్లు చెప్పారు.

అంగన్‌వాడీ కార్యకర్తలు 9లోగా విధుల్లో చేరాలి

- లేకుంటే క్రమశిక్షణ చర్యలు
- కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి ఈనెల 9వ తేదీ లోపు విధుల్లో చేరాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. లేకుంటే శాఖపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఆరు నెలల పాటు సమ్మె చేయడం నిషేధించినట్లు తెలిపారు. వీరి సమ్మె వల్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో పలు సేవలకు అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు.

ఎస్‌ఐలకు పోస్టింగ్‌లు

విశాఖ సిటీ: ఎన్నికల నేపథ్యంలో విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. తాజాగా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి 17 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు విశాఖకు కేటాయించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ శనివారం వారికి పోస్టింగ్‌లు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్‌ఐ	పోస్టింగ్
ఎల్.రామకృష్ణ	పెందుర్తి ఎల్ &ఓ
సి.హెచ్.హరికృష్ణ	ఆరిలోవ ఎల్ & ఓ
ఎ.సింహాచలం	హార్బర్ క్రైమ్
ఎ.వరదరాజులు	సీసీఎస్
సి.హెచ్.వి.మోహనరావు	స్టీల్‌ప్లాంట్ ఎల్ & ఓ
ఎం.వెంకటరావు	పీఎంపాలెం ట్రాఫిక్
ఆర్.శంకరరావు	టూ టౌన్ ఎల్ & ఓ
ఎస్.రాజు	దువ్వాడ ఎల్ & ఓ
వి.జగదీశ్వరరావు	పెందుర్తి క్రైమ్
సి.హెచ్.శంకరరావు	త్రీటౌన్ క్రైమ్
పి.ఈశ్వరరావు	త్రీటౌన్ ట్రాఫిక్
ఎం.సూర్యారావు	ఫోర్త్‌టౌన్ ఎల్ & ఓ
డి.సూర్యనారాయణ	గోపాలపట్నం క్రైమ్
జె.సత్యనారాయణ	ఎయిర్‌పోర్ట్ క్రైమ్
ఎం.ఎస్.వి.ప్రసాదరావు	మల్కాపురం క్రైమ్
ఎన్.జగదీష్	సీసీఎస్
జి.పైడిరాజు	భీమిలి ఎల్ & ఓ

నేడు స్పెల్-బి రీజినల్ స్థాయి పరీక్ష

విశాఖ విద్య: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో స్పెల్-బీ రీజినల్ స్థాయి పరీక్ష ఆదివారం జరుగనుంది. అక్కయ్యపాలెం లలితానగర్‌లో గల జ్ఞానినికేతన్ ఎయిడెడ్ హైస్కూల్ ప్రాంగణంలో జరిగే ఈ పరీక్షకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాతో పాటు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులను కేటగిరీల వారీగా విభజించారు. కేటగిరీ-1 పరిధిలో 1, 2వ తరగతి విద్యార్థులు, కేటగిరీ-2లో 3, 4 తరగతులు, కేటగిరీ-3లో 5, 6, 7 తరగతి విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. 8, 9,10 తరగతుల విద్యార్థులు కేటగిరీ-4 పరిధిలోకి వస్తారు. ఉదయం 9.20 గంటల నుంచి కేటగిరీల వారీగా పరీక్షలు జరగనున్నాయి. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా స్టూడెంట్ గుర్తింపు కార్డు, ప్లాంక్, పెన్ను లేదా పెన్సిల్ వెంట తీసుకురావాలి. పరీక్ష ప్రారంభానికి 15నిమిషాలు ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని నిర్వాహకులు తెలిపారు. ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే రీజినల్ ఈవెంట్ మేనేజర్ ఆర్.మారుతి సెల్-8121703348కు సంప్రదించవచ్చు.

వీసీని స్వయంగా ఆహ్వానించా..

- పత్రికల్లో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదు
- ఏయూ రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరుగుతున్న సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల యూత్ ఫెస్టివల్‌లో ముఖ్య అతిథిగా పాల్గొనాలని ఏయూ వీసీ ఆచార్య కె.సమతను తాను స్వయంగా ఆహ్వానించానని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తెలిపారు. దీనిపై పలు పత్రికల్లో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదన్నారు. ఆమెకు స్వల్ప అస్వస్థత కారణంగా కార్యక్రమానికి హాజరు కాలేకపోయారన్నారు. వీసీ ఆచార్య కె.సమతను అవమానించారంటూ వచ్చిన వార్తలు చూసి డాక్టరల్ ఫోరం కన్వీనర్ డాక్టర్ ఎం.సురేష్ మెనన్ శనివారం ఏయూలో నిరసన తెలిపారు. ఆ సమయంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ స్వయంగా సురేష్ మెనన్ వద్దకు వెళ్లి తమ మధ్య ఎటువంటి భేదాభిప్రాయాలు లేవని తెలిపారు. అసత్య వార్తలను నమ్మి ఇటువంటి నిరసనలు చేయవద్దని సూచించారు.

ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌గా మురళీకృష్ణ బాధ్యతల స్వీకరణ

మహారాణిపేట: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్తగా డాక్టర్ పి.వి.మురళీకృష్ణ శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు జిల్లా సమన్వయకర్తగా ఉన్న డాక్టర్ రాజేష్ ఉన్నత చదువుల నిమిత్తం సెలవు మీద వెళ్లారు. దీంతో ఖాళీగా ఉన్న ఈ పోస్టులో విజయనగరం జిల్లా లక్కవరపు కోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ పి.వి.మురళీకృష్ణను నియమిస్తూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు సీఈవో డి.కె.బాలాజీ ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ మురళీకృష్ణ శనివారం కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను మర్యాద పూర్వకంగా కలిశారు.

10 మందికి కరోనా

మహారాణిపేట: విశాఖలో 10 మందికి కరోనా సోకింది. గడిచిన 24 గంటల్లో 50 మందికి పరీక్షలు చేయగా, వీరిలో 10 మందికి కరోనా నిర్ధారణ అయింది. 32 మంది హోమ్ ఐసోలేషన్, ఇద్దరు ఆస్పత్రుల్లో ఉండగా.. 28 డిశ్చార్జ్ అయ్యారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఇప్పటివరకు 62 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది.

11న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

మహారాణిపేట: జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం ఈనెల 11న నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరు కా వాలని జెడ్పీ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర కోరారు. ఒకటి నుంచి 7 స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయన్నారు.

వీఎంఆర్‌డీఏ సీఈగా భవానీశంకర్



వీఎంఆర్‌డీఏ సీఈ భవానీశంకర్

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజనీర్ పి.శివ ప్రసాద్‌రాజు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ఉన్న భవానీ శంకర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీసీఆర్‌డీఏలో ఎస్‌ఈగా ఉన్న శివప్రసాద్‌రాజు డిప్యుటేషన్‌పై వీఎంఆర్‌డీఏ సీఈగా విధులు నిర్వర్తిస్తున్నారు. తాజాగా ఆయనను బదిలీ చేస్తూ సీఆర్‌డీఏ కమిషనర్‌కు రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

8, 9 తేదీల్లో ఎస్‌ఐ అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి, విశాఖపట్నం: ఎస్‌ఐ రాతపరీక్ష, దేహదారుఢ్య పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలనకు ఈనెల 8, 9 తేదీల్లో హాజరుకావాలని విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ తెలిపారు. పెదవాల్తేరులోని డీఐజీ కార్యాలయానికి ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలలోపు హాజరు కావాలని పేర్కొన్నారు. సివిల్ ఎస్‌ఐ (పురుషులు/మహిళలు), ఏపీఎస్పీ(ఆర్ఎస్ఐ) పోస్టులకు ఎంపికైన వారు మాత్రమే రావాలని సూచించారు.

హౌసింగ్ పీడీగా జ్ఞానవేణి

మహారాణిపేట: జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా కె.జ్ఞానవేణి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

పన్ను చెల్లింపు దారులే జాతీ నిర్మాతలు

ఆదాయపు పన్ను శాఖాధికారి అర్చన చౌదరి



మాట్లాడుతున్న అర్చన చౌదరి

బీచ్‌రోడ్డు: పన్ను చెల్లింపుదారులే జాతి అభివృద్ధికి నిర్మాతలని ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ అర్చన చౌదరి అన్నారు. శనివారం బీచ్‌రోడ్డులో ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో ట్యాక్స్ పేయర్స్ హబ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పన్ను చెల్లింపుదారుల ఫిర్యాదులు, సందేహాలు నివృత్తి చేయడానికి ఈ హబ్ ఎంతగానో ఉపయోగపడుతుం దన్నారు. సోమవారం వరకు ఈ హబ్ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటలకు వరకు అందుబాటులో ఉంటుందన్నారు. విశాఖతో సహా ఏడు నగరాల్లో ఈ హబ్‌లను నిర్వహిస్తున్నామన్నారు. ఆదాయపు పన్ను శాఖను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కియోస్క్‌లను ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా పన్ను చెల్లింపుదారుల సమస్యలు, సందేహాలు సులభంగా పరిష్కరమవుతాయన్నారు. ఈ కియోస్క్ నేటి యువతను ఆకర్షించే విధంగా బోర్డు గేమ్‌లతో అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఈ సందర్భంగా వీధి నాటం, క్విజ్, మ్యాజిక్ షో, ఆటలు, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఏపీ, తెలంగాణ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిటాలి మధుస్మిత, ఒడిశా ప్రిన్సిపల్ కమిషనర్ ఎం. భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

సాంస్కృతిక సౌరభం



నాటిక ప్రదర్శిస్తున్న విజ్ఞాన్ విద్యార్థులు



కొచ్చిన్ వర్సిటీ విద్యార్థుల తాయింబగ నాద విన్యాసం



స్కిట్ ప్రదర్శిస్తున్న శంకరాచార్య విశ్వవిద్యాలయం(కలడి) విద్యార్థుల

ఏయూక్యాంపస్ : నవరసాలను ఆవిష్కరించారు. భారతీయ కళావైభవాన్ని చాటారు. పుస్తకాలతో సహవాసం చేసే విద్యార్థులు తమలోని కళాప్రతిభను ప్రస్ఫుటం చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహిస్తున్న 37వ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కల్చరల్ ఫెస్ట్ యువభేరి దీనికి వేదికగా నిలిచింది. యునిఫెస్ట్‌లో రెండో రోజున ఉదయం మిమిక్రీ, శాస్త్రీయ నృత్యాలు, స్పాట్ పెయింటింగ్, శాస్త్రీయ వాయిద్యాలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి ఏకపాత్రాభినయం, గాత్రం, మట్టిలో బొమ్మల తయారీ, క్విజ్ పోటీలను నిర్వహించారు.

శాస్త్రీయ సౌరభం

ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రధాన వేదికపై నిర్వహించిన శాస్త్రీయ నృత్య పోటీలు విద్యార్థుల ప్రతిభాకౌశలానికి నిదర్శనంగా నిలిచాయి. తమ రాష్ట్రాన్ని ప్రతిబింబిస్తూ చేసిన నృత్యాలు భారతీయ కళావైభవాన్ని వేదికపై ఆవిష్కరించాయి.

గాత్రం, వాయిద్యం

సాగరిక ఆడిటోరియంలో నిర్వహించిన పోటీల్లో వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులు తమ గాత్రం, వాయిద్య ప్రతిభతో అలరించారు. వీణ, వేణువు, వయోలిన్, మృదంగం, నాదస్వరంపై యువతీయువకులు తమ ప్రతిభను ప్రదర్శించారు.

స్పాట్‌పెయింటింగ్, శిల్పాల తయారీ

స్పాట్ పెయింటింగ్‌లో భాగంగా విద్యార్థులు కన్వెన్షన్ సెంటర్ ప్రాంగణంలో కాన్వాస్‌పై ఆవిష్కరించారు. వర్ణాలను అద్దుతూ ప్రకృతిని, భవనాలను, ప్రజలను మాధ్యమంగా చేసుకుని అందమైన చిత్రాలను తీర్చిదిద్దారు. మట్టిబొమ్మల తయారీలో సహజత్వం తొణికిసలాడే విధంగా తమ ఆలోచనలకు, ప్రతిభను జోడించి తీర్చిదిద్దిన శిల్పాలు న్యాయనిర్ణేతల మనసులను దోచుకున్నాయి.

సామాజిక సందేశం

కన్వెన్షన్ సెంటర్‌లో సామాజిక ఇతివృత్తాలను తీసుకొని ప్రదర్శించిన రూపకాలు కట్టిపడేశాయి. అంధవిశ్వాసాలు, దేవదాసీ వ్యవస్థ, మాతంగి వంటి దురాచారాల ఇతివృత్తంగా యూనివర్సిటీ ఆఫ్ కేరళ విద్యార్థుల ప్రదర్శన హృదయాలను తడిమింది. విజ్ఞాన్ వర్సిటీ విద్యార్థుల రూపకం మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారిపోయాయని చూపుతూ.. చివర్లో దేశభక్తిని పెంచే ముగింపుతో యువతను తట్టిలేపింది. శ్రీ శంకరాచార్య విశ్వవిద్యాలయం విద్యార్థుల రూపకం ఆకట్టుకుంది.

విద్యుత్ కనెక్షన్లకు నిర్దేశించిన ఫీజులు చెల్లించాలి

- అధిక మొత్తాన్ని డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయవచ్చు
- ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ మహేంద్రనాథ్



సాక్షి, విశాఖపట్నం: కొత్తగా విద్యుత్ కనెక్షన్లు తీసుకునే వినియోగదారులు నిర్దేశించిన ఫీజులు మాత్రమే చెల్లించాలని, విద్యుత్ సిబ్బంది అధిక మొత్తాన్ని డిమాండ్ చేస్తే నేరుగా సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ఏపీఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్ సూచించారు. ఆయన చాంబర్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్తగా ఎల్‌టీ, హెచ్‌టీ కనెక్షన్లు కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు అవసరమైన డాక్యుమెంట్స్ అందిస్తే ఎంత చెల్లించాలన్నది రిజిస్టర్ మొబైల్‌కు మెసేజ్ వస్తుందన్నారు. అంతకు మించి ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా 20 కిలోవాట్లు దాటి విద్యుత్ సరఫరా అవసరమైన గ్రూప్ హౌస్‌లు కచ్చితంగా సెపరేట్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాల్సిందేనని చెప్పారు. డబుల్, ట్రిబుల్ బెడ్ రూమ్స్ 4 కంటే మించి ఉన్న అపార్ట్‌మెంట్స్ కూడా ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అగ్రికల్చర్ సర్వీసు కోసం తహసీల్దార్ నుంచి ఫారం-3తో పాటు వన్‌బీ లేదా పట్టాదారు పాసుపుస్తకాన్ని కచ్చితంగా జతపరచాలని సూచించారు. కొత్త కనెక్షన్ ఏర్పాటుకు ఎవరైనా విద్యుత్ సిబ్బంది నిర్దేశించిన ఫీజు కంటే అధికంగా డిమాండ్ చేస్తే నౌరోజీ రోడ్డులోని సర్కిల్ కార్యాలయంలో తనకు నేరుగా ఫిర్యాదు చేయాలన్నారు. స్టాండర్డ్ ఆఫ్ పెర్ఫార్మెన్స్ (ఎస్ఓపీ) నిబంధనల్లోనూ మార్పు లు చేర్పులు జరిగాయని ఎస్ఈ తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్య తలెత్తితే గతంలో నగరాలు, పట్టణాల పరిధిలో అయితే ఫిర్యాదు అందిన 24 గంటల్లో పరిష్కరించాల్సి ఉండేదని, ఇప్పుడు 12 గంటల్లోనే పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాలోనూ 48 గంటల నుంచి 24 గంటలకు కుదించినట్లు వెల్లడించారు. ఓల్టేజ్ హెచ్చుతగ్గుల ఫిర్యాదుల విషయంలోనూ, మీటర్ ఫిర్యాదులు ఇలా అనేక అంశాల్లో ఎస్ఓపీ తగ్గింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

ముగిసిన మార్స్ 2024 సదస్సు

సింధియా: భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ విశాఖపట్నంలో నిర్వహించిన రెండు రోజులు మార్స్ 2024 సదస్సు శనివారంతో ముగిసింది. తూర్పు నావికాదళ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్‌సక్సేనా ఏవీఎస్ఎమ్, ఎన్ఎం, రియర్ అడ్మిరల్ నెల్సన్ డిసౌజా ఎన్ఎం(సీఎస్ఓ టెక్)తో కలిసి సదస్సును ప్రారంభించారు. ఈ సదస్సుకు సీఎండీ, డైరెక్టర్లు, స్ట్రాటజిక్ బిజినెస్ హెడ్‌లతో పాటు ఎన్ఎస్ విక్రాంత్, ఎన్ఎస్ కమొర్తా యూనిట్లలోని మార్కెటింగ్ సిబ్బంది, సెంట్రల్ రీసెర్చ్ లాబోరేటరీల ప్రతినిధులు హాజరయ్యారు. భారత నావికాదళానికి, బీఈఎల్‌కు మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పటిష్టం చేయాలనే లక్ష్యంతో వినూత్న విధానాలను అవలంబిస్తున్నట్లు వివరించారు.

అప్పన్న స్వామీ.. అందుకో తిరుముడి

శాస్త్రోక్తంగా నృసింహ దీక్షల విరమణ



మాల విసర్జన చేస్తున్న పండితులు

సింహాచలం: అప్పన్న నామస్మరణతో సింహగిరి మార్మోగింది. మాలధారుల దీక్షా విరమణ కార్యక్రమం శనివారం శాస్త్రోక్తంగా జరిగింది. 41 రోజుల మండల దీక్ష, 32 రోజుల దీక్ష చేసిన దీక్షాధారులంతా శిరస్సుపై తిరుముడిని పెట్టుకుని మెట్లమార్గంలో, ఘాట్‌రోడ్డులో సింహగిరికి తరలివచ్చారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి వాటిని సమర్పించి, దీక్ష విరమణ చేశారు. తొలుత సింహగిరికి తరలివచ్చిన దీక్షాధారులంతా తిరుముళ్లతో స్వామివారి అంతరాలయ దర్శనం చేసుకున్నారు. అనంతరం మాడ వీధిలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద దీక్షాధారులందరి చేత పండితులు శాస్త్రోక్తంగా దీక్ష విరమణ చేయించారు. స్వాతి నక్షత్రం సందర్భంగా నిర్వహించిన నృసింహ హోమాన్ని తిలకించారు. శాంతి కల్యాణంలో పాల్గొన్నారు. దీక్ష విరమించిన వారిలో సింహాచలానికి చెందిన చందన పెరుమాళ్ల పీఠం, సింహాద్రి మఠానికి చెందిన దీక్షాధారులు ఉన్నారు. దీక్షాధారులంతా స్వామివారి పల్లకీతో కొండ దిగువ నుంచి పైకి ఘాట్‌రోడ్డులో తరలివచ్చారు. దీక్షాధారులకు దేవస్థానం కొండదిగువ నుంచి సింహగిరికి ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాటు చేసింది. అన్నప్రసాద భవనంలో అన్నప్రసాదం, లడ్డూలను అందజేసింది. దీక్షాధారులకు ఈవో శ్రీనివాసమూర్తి స్వాగతం పలికారు. ఏఈవో పాలూరి నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. చందన పెరుమాళ్ పీఠం గురుస్వామి సానబోయిన రాజు, సింహాద్రి మఠం గురుస్వామి కర్రెడ్డి సురేంద్ర పాల్గొన్నారు.

జెడ్పీ ఉద్యోగులకు పదోన్నతులు

మహారాణిపేట: జిల్లాపరిషత్‌లో పలువురు ఉద్యోగులకు పదోన్నతులు లభించాయి. జెడ్పీ క్యాంప్ కార్యాలయంలో శనివారం జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన ఉద్యోగులకు చైరపర్సన్ సుభద్ర, సీఈవో ఎం.పోలినాయుడు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పదోన్నతులు పొందిన 9 మంది జెడ్పీ చైర్‌పర్సన్, సీఈవోలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ మినిస్ట్రీయల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ ఎస్.సత్తిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జోస్ ఆలుక్కాస్ 12వ వార్షికోత్సవం



హెచ్ఎంకు చెక్కు అందజేస్తున్న మేయర్ గొలాగాని హరి వెంకటకుమారి

సీతమ్మధార: ఆశీలమెట్టలోని జోస్ ఆలుక్కాస్ 12వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. మేయర్ గొలగాని హరివెంకటకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జోస్ ఆలుక్కాస్‌లో నాణ్యమైన బంగారు నగలు, డైమండ్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. సీఎస్సార్‌లో భాగంగా నగరంలోని 10 పాఠశాలలకు కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇతర సామగ్రి కొనుగోలుకు మేయర్ చేతుల మీదుగా హెచ్ఎంలకు చెక్కులు అందజేశారు. జోస్ ఆలుక్కాస్ పీఆర్వో ఈఎస్ మాధవన్ మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా వినియోగదారులకు ప్రతీ రూ.50 వేల బంగారు ఆభరణాల కొనుగోలుపై ఓ బంగారు నాణెం ఉచితం అందజేస్తున్నట్లు తెలిపారు. వజ్రాలపై 20 శాతం, ప్లాటినం ఆభరణాలపై 7 శాతం వరకు తగ్గింపు అందిస్తున్నట్లు వివరించారు. ప్రతి కొనుగోలుపై ఉచిత బహుమతి అందిస్తున్నట్లు వెల్లడించారు. షోరూం మేనేజర్ డార్ని, ఏరియా మేనేజర్ హన్సన్ పాల్గొన్నారు.

కనులపండువగా రథయాత్ర



రథయాత్ర ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి రథయాత్ర శనివారం వైభవంగా సాగింది. అమ్మవారి మాలధారణ చేసిన భక్తులు పూర్ణ కలశాలతో యాత్రలో పాల్గొన్నారు. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన యాత్ర సాయంత్రం 4 గంటలకు మహారాణిపేటలోని అంబికాబాగ్ సీతారామచంద్ర స్వామి ఆలయం వద్ద ప్రారంభమైంది. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ రథయాత్ర ప్రారంభించారు. జగదాంబ జంక్షన్, టర్నర్‌చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజ్ డౌన్, టౌన్‌కొత్తరోడ్డు, రీడింగ్‌రూమ్ మీదుగా అమ్మవారి దేవస్థానం వరకు యాత్ర సాగింది. రథయాత్రలో విజయనగరం మహారాజ కళాశాల కళాకారుల పులివేషాలు, చెక్కభజన, కోలాటం, నవదుర్గల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈవో కె.శిరీష, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కొల్లి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.